క్లుప్తంగా

పోలీసులు బాధితుల పక్షాన నిలవాలి

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వోగా ఉన్న ఓ ఉన్నతాధికారి తీరు సరిగా లేదని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి ఆరోపించారు. మండలంలోని ఒక బంకులో పని చేస్తున్న వ్యక్తిపై శనివారం బంకు యజమాని దాడి చేసి చంపే ప్రయత్నం చేశారని, ఈ విషయంపై కేసు నమోదు చేసేందుకు తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా.. సదురు అధికారి ఫిర్యాదు తీసుకునేందుకు తిరస్కరించారని ఆరోపించారు. బాధితుడికి అండగా నిలవాల్సిన పోలీస్ అధికారి పెత్తందార్ల పక్షాన నిలవడం సరికాదన్నారు. బాధితున్నే పోలీస్ స్టేషన్లో కూర్చొబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై వివరణ కోరేందుకు తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ అధికారక ఫోన్ నంబర్‌ను సంప్రదించగా.. స్పందించలేదు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

ముస్తాబాద్: ముస్తాబాద్, సిద్దిపేట ప్రధాన రహదారిపై ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ముస్తాబాద్ గ్రామస్తులు ఆర్‌అండ్‌బీ అధికారులకు శనివారం విజ్ఞప్తి చేశారు. ముస్తాబాద్ నుంచి సిద్దిపేట వెళ్లే దారిలో వెంకట్రావుపల్లె వరకు ఎలాంటి స్పీడ్ బ్రేకర్లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు విస్తరణ పనుల అనంతరం వాహనాల వేగం పెరిగిందన్నారు. మలుపుల వద్ద, వెంకయ్యకుంట, హన్మాన్‌నగర్ రోడ్డు, బందనకల్, మోహినికుంట, వెంకట్రావుపల్లె స్టేజీల వద్ద ఎలాంటి హెచ్చరికల బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు లేవని వాపోయారు. ఇప్పటికి పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయినా.. ఆర్‌అండ్‌బీ అధికారుల్లో చలనం రావడం లేదని పేర్కొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

ముస్తాబాద్: ఆవునూర్‌లో పోచమ్మ బోనాల ఉత్సవాలను అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ఆలయంలో పోచమ్మ తల్లికి సమర్పించారు. ఊరూవాడను చల్లంగా చూడాలని, పాడి పంటలు పండాలని మొక్కులు చెల్లించుకున్నారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

మండల టాపర్‌కు సన్మానం

చందుర్తి: చందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసించి ఇంటర్ రెండో సంవత్సరంలో 955 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన ఎండీ ఆసీన్‌ను మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు శాలువాలతో శనివారం ఘనంగా సన్మానించారు. పోంచెట్టి రాకేశ్, మార్త రాజు, గుగ్గిళ్ల సాగర్, వెంగల వెంకటేశ్, తిప్పని సతీష్, మర్రి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ఇంటర్‌లో మండల టాపర్‌గా నిలిచిన కొండాపూర్‌కు చెందిన క్యారం అక్షయను గ్రామ యూత్ సభ్యులు శనివారం ఘనంగా సన్మానించారు. ఎంపీసీ సెకండియర్‌లో అక్షయ 959 మార్కులు సాధించిందని యూత్ నాయకుడు కరుణాకర్ తెలిపారు. నామాపూర్ మోడల్ స్కూల్‌లో చదివిన అక్షయ మండల టాపర్‌గా నిలవడం కొండాపూర్‌కు గర్వకారణమని పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ లక్ష్మి పాల్గొన్నారు.

మేడే కరపత్రాల ఆవిష్కరణ



వీర్నపల్లి: మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మల్లారపు దేవయ్య ఆధ్వర్యంలో మేడే కరపత్రాలను కార్మికులతో కలసి ప్రజాప్రతినిధులు శనివారం ఆవిష్కరించారు. ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగంలో పని చేసే సంఘటిత అసంఘటిత కార్మిక సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ అనేక పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. సెస్ డైరెక్టర్ మల్లేశం, బంజరా సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్‌నాయక్, మాజీ ఉప సర్పంచ్ రవి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మనోజ్ కుమార్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గుంటుకు నరేందర్, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షుడు రాజెల్లయ్య, నర్సయ్య, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిరిసిల్ల: పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయముంటుందని పట్టణ సెస్ ఏఈ సుష్మా శనివారం తెలిపారు. పట్టణంలో విద్యుత్ సరఫరా అయ్యే 11 కేవీ లైన్ మరమ్మతు పనులు, విద్యుత్ తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా వెంకంపేట, పాత బస్టాండ్, సంజీవయ్యనగర్, అశోక్‌నగర్, అనంతనగర్, అంభికానగర్, సర్దార్‌నగర్ ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 12 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

ఎల్లారెడ్డిపేట: రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, పదిర గ్రామాల్లో విద్యుత్ తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ పృథ్వీధర్‌గౌడ్ శనివారం తెలిపారు. మూడు గ్రామాలకు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

చిన్నారులకు ఆరోగ్య 'యోగ'ం

- వేసవి సెలవులు సద్వినియోగం
- సిరిసిల్లలో నిత్యం యోగాభ్యాసం
- పలుచోట్ల ప్రత్యేక శిక్షణలు

సండే స్పెషల్

సిరిసిల్లటౌన్: మారుతున్న నాగరికతలో ప్రజల ఆహారం.. శారీరక దృఢత్వంలో పెను మార్పులు వచ్చాయి. ఉరుకులు, పరుగుల జీవితంతో ప్రజల్లో అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. తీసుకునే ఆహారంతో చిన్నాపెద్దా తేడా లేకుండా శారీరక, మానసిక రుగ్మతతో బాధపడుతున్నారు. కాలానుగుణంగా మార్పులను తట్టుకుంటూ.. చిన్నారులు ఆరోగ్యంగా జీవించేందుకు సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉచిత యోగా శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. వేసవి సెలవులు కావడంతో చిన్నారులు ఆసక్తితో పాల్గొంటూ.. ఆరోగ్య యోగాన్ని పొందుతున్న వైనంపై సండే స్పెషల్ స్టోరీ ఇది.





సిరిసిల్ల ప్రభుత్వ కళాశాల మైదానంలో చిన్నారులకు ఉచిత యోగా శిబిరం

చిన్నాపెద్దా తేడా లేకుండా అన్ని వయస్సుల వాళ్లు రోగాల బారిన పడుతున్నారు. రోజులో కొంతసేపు దేశీయ శాస్త్రీయత కలిగిన యోగా సాధన భవిష్యత్ తరాలకు అందాలని నేటి తరానికి నేర్పించాలన్న లక్ష్యంతో సిరిసిల్లలో పతంజలి యోగా సాధన సమితి వారు వేసవి సెలవుల్లో ఉచిత యోగా శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. సాధారణ రోజుల్లో వార్డుల వారీగా, స్థానిక ఇందిరా పార్కులో, కొత్త చెరువు తదితర ప్రాంతాల్లో అన్ని వయస్సుల

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

వారితో ఉచిత నిత్య యోగా సాధన చేయిస్తున్నారు. యోగా, వ్యాయామం, ధ్యానం చేయడం ద్వారా రోగాల నుంచి బయటపడటమే కాకుండా.. శారీరక ఉల్లాసం, మానసిక ప్రశాంతతతో గడపడాన్ని నిర్వాహకులు వివరిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్, థైరాయిడ్, పక్షవాతం, హార్మోన్స్ అసమానత తదితర రోగాలతో బాధపడుతున్న చాలామంది నిత్య యోగా సాధనలో నిమగ్నమై ఉంటున్నారు. యోగాభ్యాసంతో జ్ఞానేంద్రియ వ్యవస్థ మెరుగుపడి.. మెదడు, నాడులు నియంత్రించబడి.. తిమ్మిర్లు, పక్షవాతం, మెదడులో రక్తం గడ్డకట్టడం, సయాటిక, స్పాండిలైటిస్ వంటి రోగాలు నియంత్రించబడి.. తమోగుణం పెరిగి ఆరోగ్యం పొందే విధానాలను ప్రజలు అలవర్చుకుంటున్నారని యోగా శిక్షకులు చెబుతున్నారు.

శరీరానికి కావాల్సిన ఆహారం తెలిసింది



యోగా ద్వారా శరీరానికి ఇవ్వాల్సిన ఆహారం గురించి తెలుసుకున్న. వ్యాయామం, సమాహార సేవనంతో యోగాభ్యాసం చేయడం బాగుంది. మానసిక ప్రశాంతత, నీరు, గాలితో అంతర్గత అవయవాలను బాగుపరచుకునే విషయాలపై అవగాహన పెరిగింది.

– శ్రీనందన, 7వతరగతి విద్యార్థిని

ఆలోచనల్లో మార్పు



యోగా సాధనతో నా ఆలోచనలు.. శారీరక ఉల్లాసంలో మార్పు వస్తోంది. మెదడు చురుగ్గా పని చేస్తోంది. ఇక్కడి శిక్షణలో సామాజిక బాధ్యతలను వివరిస్తున్నారు. తోటి వారితో ప్రవర్తన, గురువులు, పెద్దలతో గౌరవంగా నడుచుకునే విధానాలు అలవడుతున్నాయి.

– నార్ల హాసిని, విద్యార్థిని

యోగా సాధనతో ప్రయోజనాలు

- యోగా సాధనతో క్రమశిక్షణ అలవడి, మానసిక ఏకాగ్రత పెరుగుతుంది.
- పిల్లలు మానసికంగా, శారీరకంగా దృఢంగా తయారవుతారు.
- ప్రాణాయామం ద్వారా శరీరం ఉల్లాసాన్ని, ఉత్సాహంతోపాటు తేజాన్ని పెంచుకుంటుంది.
- విద్యార్థుల్లో పాఠాలు వినేప్పుడు ఏకాగ్రతతో ఉండి చదువుల్లో ఉన్నతంగా రాణిస్తారు.
- శారీరక రుగ్మతలకు దూరమై ఆరోగ్యంగా జీవించడం అలవర్చుకోవచ్చు.
- శరీరంలోని అన్ని అవయవాలకు ఆక్సీజన్ అంది, అధిక వేడిని, మలినాలను శరీరం బయటకు వదులుతుంది.
- ప్రాణాయామం వల్ల అన్ని శరీర అవయవాలు చురుగ్గా పని చేస్తాయి.

వారం రోజులుగా..



వేసవి సెలవులు సద్వినియోగం చేసుకోవడానికి వారం రోజులుగా సిరిసిల్లలో ఉచిత యోగా భ్యాసానికి వస్తున్న. ఇక్కడ మానసిక దృఢత్వం, క్రమశిక్షణ, ఉదయాన్నే నిద్ర లేవడం వంటి అలవాట్లను నేర్చుకున్న. పెద్దలతో మర్యాద అలవడుతోంది.

– ప్రేమన్ రిషిత్ అజ్మీర

సేవాభావం నేర్చుకున్న



సంపూర్ణ ఆరోగ్యంగా జీవించడం.. తోటి వ్యక్తులతో సేవాభావంతో మెలగడం నేర్చుకున్న. యోగాభ్యాసం ద్వారా శరీరం తేలికై.. ఉల్లాసంగా జీవించడం అలవడుతుంది. చదువుపై ఏకాగ్రత పెరిగి.. ఆటపాటల్లో పోటీతత్వాన్ని తట్టుకునే గుణం పెరుగుతుంది. సంప్రదాయ విద్య ఇది.

– కోటకొండ సహస్రజిత్

యోగా.. ధ్యానం నేర్పిస్తున్నాం



యోగా శిబిరానికి వస్తున్న చిన్నారులకు యోగాసనాలు, ధ్యానం చేయడం నేర్పిస్తున్నాం. చిన్నప్పటి నుంచి యోగా విద్యను నేర్చుకుంటే.. వారు భవిష్యత్తులో సనాతన ధర్మాన్ని ఆచరిస్తూ.. దేశ సంస్కృతిని పాటిస్తూ.. ఆరోగ్య జీవితాన్ని గడపడం తథ్యం.

– ఉప్పుల శ్రీనివాస్, యోగా గురువు

కేంద్ర పథకాలు ప్రజలకు వివరించాలి

ఎల్లారెడ్డిపేట: నిరుపేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజలకు వివరించి ఈ ఎన్నికల్లో ఓట్లడగాలని బీజేపీ జిల్లా కార్యదర్శి మద్దుల బుగ్గారెడ్డి, మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం బీజేపీ ఎన్నికల ప్రచార సన్నాహక సమావేశం నిర్వహించారు. నాయకులు మినహాజ్‌ఖాన్, సత్యంరెడ్డి, లక్ష్మారెడ్డి, కిరణ్‌నాయక్, రామచంద్రం, గణేశ్, శ్రీశైలం, రవి, రామచంద్రారెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌ని భారీ మెజార్టీతో గెలిపిద్దాం

ముస్తాబాద్: ప్రధాన మంత్రి మోదీ అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తూ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించేలా పని చేయాలని మండల అధ్యక్షుడు



ముస్తాబాద్: మాట్లాడుతున్న అంజాగౌడ్

మెరుగు అంజాగౌడ్ అన్నారు. ముస్తాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. జిల్లా అధికార ప్రతినిధి సంతోష్‌రెడ్డి, నాయకులు మీస సంజీవ్, బాధ నరేశ్, శ్రీనివాస్‌రావు, యెల్ల గిరి, వెంకటేశ్, మహేందర్, రమేశ్‌రెడ్డి, మల్లేశ్, కృష్ణ, రమేశ్, శంకర్, బాల్‌రెడ్డి, కల్యాణ్, మహేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం

బోయినపల్లి: మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయం ఎదుట శనివారం మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. పార్టీ పతాకం ఆవిష్కరించారు. నాయకులు కొనుకటి లచ్చిరెడ్డి, గుంటి శంకర్, నల్లగొండ అనిల్, భీమనాథుని రమేశ్, నాగరాజు, ముద్దం రవి, ఎమిరెడ్డి మల్లారెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని జెడ్పీటీసీ కార్యాలయంలో శనివారం బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి జెండా ఆవిష్కరించారు. జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు కొండ రమేశ్‌గౌడ్, గుల్లపల్లి నర్సింహారెడ్డి, దేవారెడ్డి, దేవరాజు, హసన్, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఎగరేస్తున్న కొండయ్య

ముస్తాబాద్: ముస్తాబాద్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో జెండాను మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు ఆవిష్కరించారు. సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సీనియర్ నాయకులు కల్వకుంట్ల గోపాల్‌రావు, అక్కరాజు శ్రీనివాస్, వెంకటనర్సింగరావు, నర్సింహారెడ్డి, సుమతి, దేవయ్య, నర్సింలు, స్వామి, సుధాకర్, రాజు, విశ్వనాథ్, వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాచర్లగొల్లపల్లిని శనివారం రాత్రి పోలీసులు దిగ్బంధించారు. పలు వాహనాల్లో ఎన్నికల డబ్బులు తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలో సిరిసిల్ల–కామారెడ్డి రహదారిపై వెళ్తున్న ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. మద్యం తరలింపుపై వాహనదారులను పోలీసులు ప్రశ్నించారు. బండి కాగితాలు లేని 15 వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. వాహనదారులు




వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

రూ.50వేలకు మించి తరలిస్తే డబ్బులను సీజ్ చేస్తామన్నారు. ఏఎస్సై కిషన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

వేములవాడఅర్బన్: గ్రామాల్లోని ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని ఎంపీపీ బూర వజ్రమ్మ అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. వేసవి కాలంలో గ్రామాల్లో మంచినీటికి ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. పల్లె ప్రకృతి వనాల్లో మొక్కలకు నీటి వసతి కల్పించాలని అన్నారు. జెడ్పీటీసీ మ్యాకల రవి, ఎంపీడీవో రాజీవ్ మల్‌హోత్ర, సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు, అధికారులు తదితరులున్నారు.

వీర్నపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 30న ఉదయం 11 గంటలకు ఎంపీపీ మాలోత్ భూల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో సత్తయ్య తెలిపారు. అన్ని శాఖల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ బూర వజ్రమ్మ





రోడ్లన్నీ నిర్మానుష్యం

వేములవాడ: భానుడి ప్రతాపం పెరగడంతో వేములవాడలో శనివారం 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో జనం రోడ్లపై తిరిగేందుకు జంకారు. పగటి పూట ఇలా రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి.

బీజేపీ, కాంగ్రెస్‌లకు తగిన గుణపాఠం చెప్పాలి

రుద్రంగి: నిజామాబాద్ ఎంపీగా గెలిచి మానాల అభివృద్ధి పనులకు ఒక్క పైసా కూడా తీసుకురాని బీజేపీ ఎంపీ అర్వింద్, అసెంబ్లీ ఎన్నికల్లో హామీలు ఇచ్చి నెరవేర్చని కాంగ్రెస్‌లకు పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని బాల్కొండ శాసన సభ్యుడు వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శనివారం మానాల గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నిజామాబాద్ ఎంపీగా బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మండల కేంద్రంలో ఎంపీపీ గంగం స్వరూపారాణి, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కరీంనగర్ ఎంపీగా వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. వైస్ ఎంపీపీ పీసరి చిన్న భూమయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వినోద్‌కుమార్‌ను గెలిపించాలి

గంభీరావుపేట(సిరిసిల్ల): కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వినోద్‌కుమార్‌ను గెలిపించాలని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు కోరారు. గంభీరావుపేట మండల కేంద్రంలో శనివారం వినోద్‌కుమార్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ జెండా ఆవిష్కరించారు. ఎంపీపీ వంగ కరుణ, వైస్ ఎంపీపీ దోసల లత, నాయకులు వెంకటస్వామిగౌడ్, లక్ష్మణ్, సురేందర్ రెడ్డి, హరీష్, రాజు, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మానాలలో మాట్లాడుతున్న వేముల ప్రశాంత్‌రెడ్డి

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

ఎల్లారెడ్డిపేట: బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ గెలుపే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు పని చేయాలని జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మండలంలో శనివారం ఎన్నికల ప్రచారం జోరందుకుంది. 24 గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేశారు. మండల కేంద్రంలో ఆగయ్య ఇంటింటా తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, మండల అధ్యక్షుడు కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు పర్శరాములుగౌడ్, సందీప్, లక్ష్మణ్, హసన్, శ్రీనివాస్‌రెడ్డి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: జిల్లెల్ల గ్రామంలో శనివారం బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కరీంనగర్ ఎంపీగా బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలను అభ్యర్థించారు. సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, ఎంపీపీ పడిగెల మానస, ఎంపీటీసీలు చెన్నమనేని రాజేశ్వరరావు, కోడి అంతయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, వెంకటరమణారెడ్డి, సింగిరెడ్డి రవీందర్‌రెడ్డి, పడిగెల రాజు, సద్ధ శోభ తదితరులు పాల్గొన్నారు.



ఓట్లు అభ్యర్థిస్తున్న టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

కొలనూర్‌లో..

కోనరావుపేట: బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ కొలనూర్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, ఎంపీపీ చంద్రయ్య, సెస్ వైస్ చైర్మన్ తిరుపతి, సింగిల్‌విండో చైర్మన్లు బండ నర్సయ్య, సంకినేని రాంమోహన్‌రావు, నాయకులు తాళ్లపెల్లి సతీష్‌గౌడ్, బుర్ర పవన్, బిట్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



గాయపడ్డ రాజనర్సు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల బొప్పాపూర్ శివారులోని కోరుట్లపేట రహదారిపై వరి కోత యంత్రం ఢీకొని ఒకరు తీవ్రంగా గాయపడ్డాడు. గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటకు చెందిన రాజనర్సు గాయపడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. రాచర్ల బొప్పాపూర్ నుంచి కోట్లపేటకు వెళ్లే రహదారిపై రైతులు వరి ధాన్యాన్ని ఆరబెట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఒకేరోజు మండలంలో రోడ్డుపై పోసిన ధాన్యం కుప్పలతో రెండు ప్రమాదాలు జరిగాయి.

బెల్ట్‌షాప్‌ల నిర్వహణపై సీరియస్

సిరిసిల్లక్రైం: ప్రభుత్వ అధికారిక మద్యం దుకాణాలు మినహా బెల్టుషాపుల నిర్వహణకు అనుమతులు లేవని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖరరెడ్డి హెచ్చరించారు. సిరిసిల్లలో శనివారం మీడియాతో మాట్లాడారు. డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 96 కేసుల్లో రూ.4,60,623 విలువ గల 760 లీటర్ల మద్యం సీజ్ చేసినట్లు తెలిపారు. వైన్స్ యజమానులు సైతం నిబంధనలు పాటించకపోతే కేసులు నమోదు చేస్తామన్నారు.

తడగొండలో అగ్ని ప్రమాదం

బోయినపల్లి: తడగొండ గ్రామ నల్లాల బావి వద్ద శనివారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో నల్లాల బావి స్టార్టర్, విద్యుత్ మోటారుకు వెళ్లే తీగలు దగ్ధమయ్యాయని గ్రామస్తులు తెలిపారు. చుట్టుపక్కల పొలాల్లో ఉన్న రైతులు మంటలను ఆర్పడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. కార్యదర్శి మల్లేష్ పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు.



స్టార్టర్‌ను పరిశీలిస్తున్న పంచాయతీ సిబ్బంది

రూ.97వేల నగదు పట్టివేత

సిరిసిల్లక్రైం: పార్లమెంట్ ఎన్నికల నిబంధనల నేపథ్యంలో రూ.50వేలకు మించి నగదును తీసుకెళ్లొద్దని, నిబంధనను అతిక్రమించిన వ్యక్తి నుంచి రూ.97,520 పట్టుకున్నట్లు టౌన్ సీఐ రఘుపతి తెలిపారు. సిరిసిల్ల అంబేడ్కర్ సర్కిల్‌లో సాధారణ తనిఖీలు చేస్తుండగా.. బైక్‌పై వస్తున్న రెడ్డి అనే వ్యక్తి తన బైక్‌లో రూ.97,520 తీసుకొస్తూ పట్టుబడ్డాడు. వీటిని సీజ్ చేస్తామని ఎస్‌ఐ మల్లేశం అనగా.. పాల డెయిరీ నిమిత్తం ఈ సొమ్ము తీసుకెళ్తున్నట్లు రెడ్డి తెలిపాడు. సొమ్మును ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగిస్తామని, పత్రాలు కలెక్టర్ సమక్షంలో చూపించి విడుదల చేసుకోవాలని పోలీసులు సూచించారు.



ఫ్లయింగ్ స్క్వాడ్‌కు నగదు అప్పగిస్తున్న సీఐ రఘుపతి

ఈత, తాటి చెట్లకు మంటలు

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల–రగుడు పరిధిలోని తాటి, ఈత వనాలకు శనివారం నిప్పంటుకుంది. స్థానికుల సమాచారంతో ఫైర్ సిబ్బంది చేరుకొని సుమారు రెండు గంటలు శ్రమించి మంటలను ఆర్పేశారు. అనుకోని ప్రమాదంలో సుమారు వెయ్యి వరకు ఈత, తాటి చెట్లు అగ్గికి ఆహుతై ఉంటాయని బాధితులు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ నాయకుడు వంగ అనిల్‌కుమార్, గౌడ సంఘం అధ్యక్షుడు పర్శరాములు, వెంకటేశ్, ప్రశాంత్, ప్రదీప్ తదితరులు కోరారు.



వాచ్‌మెన్‌కు గాయాలు

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఢీకొని రాజిరెడ్డి ఆసుపత్రి వాచ్‌మెన్‌కు శనివారం తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రి వద్ద ఉన్న వాచ్‌మెన్ యాదగిరిని వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో వాచ్‌మెన్ రెండు కాళ్లకు తీవ్ర గాయాలై రక్తస్రావమైంది. స్థానికులు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

స్వగ్రామానికి వలస జీవి మృతదేహం

బోయినపల్లి: విలాసాగర్‌కు చెందిన శ్రీనివాస్(58) దుబాయిలో గుండెపోటుతో మృతిచెందగా.. మృతదేహం శుక్రవారం రాత్రి స్వగ్రామం చేరుకుంది. శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. భార్య పద్మ, ఇద్దరు కుమార్తెలున్నారు. వీరితోపాటు తడగొండకు చెందిన మణితేజ(12) కుటుంబ సభ్యులను ఎంపీ సంజయ్ పరామర్శించారు.

విజయవంతం చేయాలి

కోనరావుపేట: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మే 1న కోనరావుపేటలో నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా అన్నారు. కోనరావుపేటలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.